క్లుప్తంగా

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని ఈదులబాయితండా, రామనంతాపురం గ్రామాల్లో గల అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించడంతో పాటు పనులు నాణ్యవంతంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అదేవిధంగా వచ్చే నెల 8లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి సంకిరెడ్డిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళ కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలించారు. స్కూళ్లు తెరిచేలోపు యూనిఫాంలు రెడీ చేయాలని మహిళ సంఘాల సభ్యులకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీఓ రవీందర్‌బాబు, పంచాయతీ రాజ్ ఏఈ షబ్బీర్ ఉన్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయం



ఆత్మకూర్: మున్సిపాలిటీలోని వార్డుల్లో ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం చేస్తూ వార్డుల అధికారులు ముందుకెళ్లాలని కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ వార్డుల అధికారులతో సమావేశమయ్యారు. ప్రతినిత్యం వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించాలని, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, జనన, మరణాలు, జనాభా, సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బస్సు నిలిపివేయడం సరికాదు

వీపనగండ్ల: ఐదేళ్ల క్రితం తమ గ్రామానికి రద్దయిన బస్సులను పునరుద్ధరించాలని విజ్ఞప్తులు చేస్తుండగా.. ఎన్నికల ముందు నాలుగు రోజులు ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపి ఆ వెంటనే నిలిపివేశారని గోపల్‌దిన్నె ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. వనపర్తి, కొల్లాపూర్, ఆర్టీసీ డిపో అధికారులను తమ గ్రామానికి గతంలో నడుపుతున్న బస్సులను పునరుద్ధరించాలని ఎన్నోమార్లు విన్నవించామన్నారు. మొక్కుబడిగా కొల్లాపూర్ డిపో అధికారులు ఉదయం 9 గంటలకు తమ గ్రామం నుంచి పెబ్బేరు పట్టణానికి ఒక బస్సును నడిపారని, ఆ వెంటనే రద్దు చేశారని మండిపడ్డారు. అధికారులు, మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి తమ గ్రామానికి బస్సు వసతి కల్పించాలని గోపల్‌దిన్నె, రంగవరం ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమానికి పని చేస్తా



అలంపూర్: ప్రజా సంక్షేమం కోసం పని చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీలను గురువారం బాధితులకు అందజేశారు. ఉండవెల్లి మండల మెన్నిపాడు గ్రామానికి చెందిన పార్వతమ్మ వైద్యం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి నుంచి ఆపరేషన్ కోసం రూ.5 లక్షలు మంజూరు కావడంతో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇటిక్యాల మండలం ఆర్ గార్లపాడు గ్రామానికి చెందిన బాధితులు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారికి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు.కార్యక్రమంలో జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు గోపాల్, నాయకులు సురేష్, నాగన్న, తదితరులు ఉన్నారు.

ఆర్థిక, సామాజిక దోపిడీ నిర్మూలనే ధ్యేయం

గద్వాల అర్బన్: సమాజంలో ఆర్థిక, సామాజిక దోపిడీని నిర్మూలించి అసమానతలు లేని సమాజ స్థాపనే సీపీఎం ధ్యేయమని జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దోపిడీ చేస్తున్న పెట్టుబడిదారుల కుట్రలను బయటపెడుతూ అణచివేయబడుతున్న పీడిత ప్రజలకు అండగా ఉంటామన్నారు. రాజకీయ చైతన్యంతో ఆర్థిక, సామాజిక, దోపిడీ నిర్మూలనలో జరిగే పోరాటాల్లో ప్రజలను భాగస్వాములను చేయడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో రేపల్లె దేవదాస్, వీవీ నర్సింహ, మద్దిలేటి, పరంజ్యోతి, ఆంజనేయులు, విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఆత్మకూర్: మార్కెట్‌లో బీటీ 3 నకిలీ విత్తనాలు చలామణి అవుతున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలను కొనుగోలు చేసుకుని మోసపోవద్దని మండల వ్యవసాయశాఖ విస్తరణ అధికారి మహేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని మూలమళ్లలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక దిగుబడుల కోసం నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వ లైసెన్స్ పొంది అర్హత ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని తప్పనిసరిగా రశీదును పొందాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి నిత్యం అందుబాటులో ఉంటారని, రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.

అమరచింత: వానాకాలం పంటల సాగు వ్యవహారంలో రైతులు విత్తనాల కొనుగోలు వ్యవహారంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటను సాగు చేస్తే ఆశించిన దిగుబడి సాధ్యమని ఏఓ వినయ్ తెలిపారు. మండలంలోని సింగంపేట, నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో వ్యవసాయ సాగు విషయాలపై రైతులకు, రైతు కూలీలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలను నాటే సమయంలో పంట పొలాలను ఎలా దుక్కిదున్నాలో అన్న విషయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



దొండాయిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ నరేష్

పాన్‌గల్: లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని దొండాయిపల్లి, చింతకుంట, కదిరెపాడు, చిక్కేపల్లి, గోప్లాపూర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సుకు వారు హాజరయ్యారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పాకెట్లపైన తయారీ, గడువు తేదీ, మొలకెత్తే శాతం వాటిని సరిచూసుకొని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు నరేష్, శైలజ, అఖిల, నరేష్, మహేశ్వరీ, రైతులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎరువుల దుకాణం నుంచి నకిలీ విత్తనాలు అమ్మితే షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ హెచ్చరించారు. గ్రామాల్లో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనల మేరకు రైతులు విత్తనాల కొనుగోలు చేయాలని, వ్యర్థపదార్థాల పేరుతో పంట పొలాలకు నిప్పు పెట్టడం సరికాదని దాంతో రైతులకు మేలు చేసే క్రిములు నశిస్తాయన్నారు. నకిలీ విత్తనాల అమ్మకంపై రైతులు జాగ్రత్త వహించి తమకు సమాచారాన్ని ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మూలమళ్లలో..



సింగంపేటలో రైతు కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వినయ్

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

పాన్‌గల్: వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న కారణంగా సీజనల్ వ్యాధులతో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నివారణలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలను చైతన్యం చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీ నాగరాజుతో కలిసి ఆయన వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో సంభవించే వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడు వాపు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య విషయాలు, కాన్పుల సంఖ్య, టీబీ, లెప్రసీ, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల నమోదు తదితర అంశాలపై చర్చించారు. ప్రతి కాన్పు పీహెచ్‌సీలోనే చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య

ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్

చిన్నంబావి: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో భాగంగా మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి సోషల్ ఆడిట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సోషల్ ఆడిట్‌కు డీఆర్‌డీఓ నాగేంద్రం హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్‌లో భాగంగా అధికారులు ఆయా గ్రామ సభల్లో 2023–24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులపై నివేదిక అందించామన్నారు. దాంట్లో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా బాధ్యులపై చర్యలు ఉంటాయన్నారు. తమ దృష్టికి వచ్చిన అంశాలపై చర్చించారు. మండలంలోని 17గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సుల్తాన్, అంబుడ్స్‌మెంట్ సత్యనారాయణరెడ్డి, ఏపీఓ రహీం, ఎంపీడీఓ రమణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగేంద్రం

ఒండ్రు మట్టిని సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న ఒండ్రు మట్టి తరలింపు పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. గురువారం మండలంలోని అన్నారంతండాలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒండ్రు మట్టితో పంట పొలాలకు జీవం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. రైతులకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కూలీల మస్టర్స్‌ను తనిఖీ చేశారు. గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. వర్షాకాలం సీజన్ వరకు జీపీకి నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేసుకోవాలన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

బాధిత కుటుంబానికి పరామర్శ

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 19వ వార్డుకు చెందిన ఆవుల చంద్రయ్య గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే మేఘారెడ్డికి కౌన్సిలర్ చంద్రకళ, ఎల్‌ఐసీ కృష్ణ సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూ. 5వేల ఆర్థికసాయం పంపించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, సతీష్ గురువారం ఆవుల చంద్రయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేసి, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని దిగులు చెందొద్దని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ద్యారపోగు వెంకటేష్, జయానందం, తిరుపతయ్య, రవి యాదవ్, గోపి, కృష్ణ సాగర్, శశాంక్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



పెబ్బేరు రూరల్: మండలంలోని కడుకుంట్ల బీసీ కాలనీలో కొన్నేళ్లుగా తాగునీటి సమస్య ఉందని స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గురువారం బోరు బండిని పంపించి గ్రామంలోని బీసీ కాలనీలో ఒకటి, పోచమ్మ గుడి సమీపంలో మరో బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్య ఉందని చెప్పిన వెంటనే స్పందించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన కాంగ్రెస్ నాయకులు రవికిరణ్, బోరు వేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన



తహసీల్దార్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

ఆత్మకూర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడంతో అంబేడ్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం మండలంలోని ఆరేపల్లికి చెందిన బీజేపీ నాయకుడు తెలుగు వేణు వాట్సాప్ గ్రూపుల్లో అంబేడ్కర్‌ను కించపరుస్తూ రిజర్వేషన్ల విషయంలో వాయిస్ మెసేజ్ పెట్టినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆయా సంఘాల నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అలాగే నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఆరేపల్లి వేణుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుర్మన్న, నర్సింహ, సుధాకర్, ప్రకాష్, లాలు, మధు, కిషోర్, కురుమూర్తి, రంజిత్, దండు శ్రీను, రమేష్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

అమరచింత: మండల కేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను గురువారం సీఐటీయూ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీఐటీయూ జెండాను బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ మాట్లాడుతూ ఐక్య పోరాటాల రథసారథి సీఐటీయూ అని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. హక్కుల సాధన కోసం కార్మికులు సంఘటితంగా పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, హరికృష్ణ, రాజశేఖర్, కాకి శ్రీను, చిన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.


ఐక్య పోరాటాల రథసారథి..

కొత్తకోట రూరల్: కార్మికుల ఐక్య పోరాటాల రథసారథి సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం పట్టణ కేంద్రంలో కార్మిక సంఘాల నాయకులతో కలిసి జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న రోజువారి సమస్యలు, వారి హక్కుల కోసం అండగా నిలబడి పోరాటం నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజనం, ఉపాధి హామీ, నేషనల్ హెల్త్ మిషన్, సర్వశిక్షణ అభియాన్ రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో కోతలు విధించారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, కుర్మన్న, వెంకటయ్య, మల్లేష్, రమేష్, రాములు, ఎల్లన్న, మహేష్, తిరుపతన్న, విజయ్, ఆంజనేయులు, వెంకటన్న, తిమ్మన్న, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



అమరచింతలో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

‘ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి’



మాట్లాడుతున్న పుట్టా ఆంజనేయులు

పెబ్బేరు రూరల్: కొన్నేళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఆశావర్కర్లకు ఖచ్చిత వేతనం కింద రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో గురువారం ఆశావర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాలు ఇందిర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఖచ్చిత వేతనం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆశావర్కర్లను ఇబ్బంది పెట్టేందుకు పరీక్షలు నిర్వహించడం సరికాదని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చదువుతో సంబంధం లేకుండా కొందరు ఆశాలు ఏళ్ల తరబడి పనిచేస్తున్నారని, ఇలాంటి నిర్ణయంతో వారికి అన్యాయం జరుగుతుందన్నారు. రిటైర్డ్‌మెంట్ అయ్యే వయస్సులో పరీక్షలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. పల్స్‌పోలియో, లెప్రసీ తదితర పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ, జిల్లా కార్యదర్శి సునీత మాట్లాడుతూ ఆశాల రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం మే 31 నుంచి డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇవ్వాలని, జూన్ 1న పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలకిష్టమ్మ, భాగ్యమ్మ, పార్వతమ్మ, శ్యామల, జ్యోతి, సత్యమ్మ, జులేఖ, అలివేల తదితరులు ఉన్నారు.

అదుపుతప్పి డీసీఎం బోల్తా

మానవపాడు: డీసీఎంను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఓవర్ టేక్ చేస్తుండగా పక్కకు తప్పించబోయి అదుపు తప్పి కింద పడిన సంఘటన గురువారం మండలంలోని ఇటిక్యాల శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కడప నుంచి హైదరాబాద్‌కు దోసకాయ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం, అదేవైపుగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డీసీఎంను ఓవర్ టేక్ చేయబోయింది. డీసీఎం పక్కకు డ్రైవ్ చేయగా అదుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ చిన్న రెడ్డయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

‘శ్రీధర్‌రెడ్డిది ముమ్మాటికీ రాజకీయ హత్యే’



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్‌రెడ్డిని అధికార పార్టీ అండతోనే హత్య చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మండలంలోని స్థానిక జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి అండతోనే వారి అనుచరులు మూడు హత్యలు చేశారని, హత్యా రాజకీయాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం కాంగ్రెస్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి అమాయకుడైన శ్రీధర్‌రెడ్డిపై ఘోరమైన ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బ్రతికిన న్నాళ్లు చీమకు కూడా హని చేయలేదని, అలాంటి వ్యక్తిపై వివాహేతర సంబంధాలు, ఆర్థిక ఆరోపణలు, భూకబ్జాదారుడు అని ఆరోపించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని, హత్య జరిగి వారం రోజులు గడుస్తున్నా నిందితులను పట్టుకోకపోవడం పోలీసులు నిర్లక్ష్యాన్ని నిదర్శనమన్నారు. హత్యకు సంబంధం ఉందని కొందరి పేర్లతో శ్రీధర్‌రెడ్డి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ, వైస్ ఎంపీపీ పుష్పలత, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, మధు, రామస్వామి, శివుడు, శివారెడ్డి, డేగ శేఖర్, నరసింహ, రాజురెడ్డి పాల్గొన్నారు.

నరసింహశర్మకు సన్మానం

వనపర్తి టౌన్: సాహితీ కళా పోషణలో విశేషంగా కృషి చేసినందుకుగాను పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాఖ్యాత డాక్టర్ నాయకంటి నరసింహశర్మకు అరుదైన గౌరవం దక్కింది. కుసుమ ధర్మన్న కళాపీఠం, పాలడుగు నాగయ్య సాహితీ పీఠం తెలుగు చైతన్య సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనానికి వనపర్తి జిల్లా తరఫున నాయకంటికి ఆహ్వానం అందింది. ఈ మేరకు సురవరం ప్రతాపరెడ్డి రచించిన రచనలు, పోరాటాలు, చరిత్రపై కవిత్వం రూపంలో అందరినీ ఆకట్టుకునేలా ఎన్నో విషయాలను వివరించారు. దీంతో ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి, ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధాకుసుమ, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజిని తదతరులు అవార్డును అందజేస్తూ ఘనంగా సన్మానించారు. సుమారు మూడు దశాబ్దాలుగా సాహిత్యంలో ఆయన చేస్తున్న సేవలు మరువలేనివని పట్టణానికి చెందిన పలువురు సాహితీ వేత్తలు, రాజకీయ పార్టీల నాయకులు అన్నారు.



సాహితీ అవార్డును అందుకుంటున్న నరసింహశర్మ

రాష్ట్ర రాజముద్ర మార్చొద్దు

అమరచింత: తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో చార్మినార్‌తో పాటు కాకతీయుల తోరణాన్ని తొలగించొద్దని, అవి తెలంగాణ సంస్కృతిని చాటి చెబుతున్నాయని తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ కలాంపాషా అన్నారు. కొత్త ప్రభుత్వం రాష్ట్ర రాజముద్రికలో మార్పులు చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. గతంలో చార్మినార్‌కు 400 ఏళ్ల సందర్భంగా సంబురాలను చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు చార్మినార్‌ను రాజముద్ర నుంచి తొలగించేందుకు యత్నాలు చేయడం తగదన్నారు.

జాడలేని భూసార పరీక్షలు



చిన్నంబావి శివారులో భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

- అవగాహన కల్పించని అధికారులు
- అయోమయంలో రైతులు

చిన్నంబావి: రైతులకు భూమి నాణ్యత, వాడాల్సిన ఎరువులను గుర్తించేందుకు అవసరమయ్యే భూసార పరీక్షలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ రకం పంటలకు భూమి అనుకూలంగా ఉందో రైతులకు తెలిసినప్పుడే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. భూసారాన్ని ఖచ్చితత్వంతో పరీక్షించినప్పుడే ఎరువుల వినియోగంపై అంచనా వస్తుంది. పంటల సాగులో అధిక దిగుబడులను సాగించేందుకు మట్టి కీలక పాత్ర పోషిస్తుంది. మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేసి వ్యవసాయధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు. కానీ రెండేళ్లుగా భూసార పరీక్షల జాడలేదు. వానాకాలం సాగు పనులు వ్యవసాయ దుక్కులు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా మట్టి నమూనాల సేకరణ జరగలేదు.

27వేల ఎకరాల్లో సాగు

మండలంలో 27వేల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగవతున్నాయి. ఇందులో 8వేల ఎకరాల్లో మొక్కజొన్న, 2,700ఎకరాల్లో వేరుశనగ, 5వేల ఎకరాల్లో వరి, 1,400 ఎకరాల్లో మామిడి, మరో 5వేల ఎకరాల్లో ఉల్లి, మిరప వంటి వాణిజ్య పంటలను సాగుచేస్తారు. కానీ రెండేళ్లుగా మండలంలో భూసార పరీక్షలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పంటల సాగు సజావుగా సాగట్లేదు. భూమి రకాన్ని పంట చేయకపోవడంతో ఆ ప్రభావం దిగుబడులపై పడుతోంది.

రైతుకు లాభాలు ఇవే..

భూసార పరీక్షల ద్వారా భూమి స్వభావం తెలుస్తుంది. దానిలో ఉన్న పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియడంతో దాన్ని బట్టి నేల రకానికి సంబంధించిన పంటలు సాగు చేస్తే వృథా ఖర్చులు ఉండవు. నేలకు ఆమ్ల గుణం ఉంటే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సున్నం వాడి స్థాయి తగ్గించుకునే విషయాలపై రైతులకు అవగాహన వచ్చే అవకాశం ఉంటుంది. అదేవిధంగా మట్టిలో లభ్యమయయ్యే సూక్ష్మధాతువులు, ఇనుము, జింక్, బోరాన్ ఇతర సేంద్రియ కార్బనం, పీహెచ్ మొదలగు వాటిని గురించి రైతులకు సమాచారం కేవలం భూసార పరీక్షల ద్వారా వెల్లడవుతుంది.

అవగాహన కల్పించాలి..



ప్రతి ఏడాది వేసవి కాలంలో దుక్కులు దున్ని తొలకరి వర్షాలకు విత్తనాలు నాటుతాం. పేరుకు పంటలు పండిస్తున్నామన్నా మాటే తప్పా అధిక దిగుబడులు రావడం లేదు. వ్యవసాయధికారులు భూసార పరీక్షలు నిర్వహించి మా భూమిలో ఏ పోషకాలు అవసరమో తెలియజేస్తే వాటిని వాడి దిగుబడులు సాధిస్తాం.

– ఉమేష్‌నాయుడు, బెక్కెం

భూసార పరీక్షలు చేయిస్తాం..



భూసార పరీక్షల కోసం ఎవరైనా రైతులు ఏఈఓలను సంప్రదిస్తే మట్టి నమూనాలను సేకరిస్తాం. వాటిని భూసార పరీక్ష కేంద్రాలకు తరలిస్తాం. ఇప్పటి వరకు దీనిపై అధికారికంగా ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఆదేశాలు రాలేదు. మట్టి నమూనాలను సేకరించి కృషి విజ్ఞానకేంద్రం, భూసార పరీక్ష కేంద్రాలకు పంపిస్తే ఇరవై రోజుల్లో ఫలితాలు వస్తాయి.

– డాకేశ్వర్‌గౌడ్, ఏఓ